క్లుప్తంగా

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను సీనియర్ అసిస్టెంట్‌కు అందజేస్తున్న వలంటీర్లు

కోసిగి: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన 12 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ సిరాజ్ ఉద్దౌలాను కలిసి రాజీనామ పత్రాలను అందజేశారు. స్థానిక సచివాలయం-4 నుంచి ఎస్.ఆంజనేయులు, శ్యామషాత్రబేజ్, యూసుఫ్, కోసిగి-5 బి.ఆంజనేయులు, ఆర్లబండ గ్రామం నుంచి అశోక్, షేక్షావలి, మల్లికార్జున, వాసు, ఖాసిం, సాతనూరు గ్రామానికి చెందిన బీరప్ప,వడ్డే రమేష్, అగసనూరు నుంచి యల్లాలింగ రాజీనామా చేశారు. ఈ ఐదేళ్ల పాటు తమకు ఉపాధి కల్పించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గెలిపించుకునేందు కృషి చేస్తామని చెప్పారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

కౌతాళం: రంజాన్ మాసంలో భాగంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారి, దేశాయ్ విశాల్ ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సతీమణి కాచపురం సర్పంచ్ వై.జయమ్మ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలోనున్న ముస్లింలకు ఇఫ్తార్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఇఫ్తార్ ఏర్పాటు చేసిన విశాల్‌దేశాయిను అభినందించారు. గ్రామ సర్పంచ్ పాల్ దినకరన్, ఉప సర్పంచ్ సక్రి తిక్కయ్య, వైస్ ఎంపీపీ రామలింగయ్యస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, నాయకులు చౌదరి బసవ, వడ్డెరాము, అబ్దుల్ సమద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పాపమ్మ ఆరాధన



కలశాలతో చిన్నారులు, మహిళలు

ఆదోని అర్బన్: పట్టణంలోని మరాఠీ వాడి ప్రాంతంలో సద్గురు సర్కార్ స్వామి వారి ధ్యాన మందిర మఠంలో వెలిసిన పాపమ్మ అమ్మవారి 68వ ఆరాధన ఉత్సవం శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మఠం నుంచి పురవీధుల్లో అమ్మవారి ఉత్సవం విగ్రహంతో రథోత్సవం జరిగింది. మహిళలు, చిన్నారులు, కలశాలతో రథోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎల్లమ్మ, మాన్‌కార్ రమేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆస్తి నష్టం



కాలిన నగదు

నందవరం: మండలంలోని కొత్త కైరవాడిలో గ్రామంలో శుక్రవారం రాత్రి కాశీ, ఈరమ్మ దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి కొట్టంలో నిద్రిస్తుండగా విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. భార్య, భర్త అప్రమత్తమై ఇద్దరు పిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. కాగా కొట్టంతో పాటు బీరువా, ఫ్రిజ్, రూ.25 వేల నగదు, ధాన్యం ఇతర సామగ్రి పూర్తిగా కాలిపోయి దాదాపు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక కుమారుడు ప్రతుల్ గ్రామానికి చేరుకుని కొట్టాన్ని పరిశీలించారు. బాధితుడిని ఓదార్చి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో బడీరాత్

ఆలూరు రూరల్: లైలతుల్ ఖదర్ (బడీరాత్)ను ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇషా, తరావీ నమాజ్ అనంతరం రాత్రంతా అల్లాహ్ ఆరాధనలో గడిపారు. పెద్దలు, పిల్లలు ప్రత్యేక నమాజ్ చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో లైలతుల్ ఖదర్‌కు ప్రత్యేక స్థానం ఉంది. వెయ్యి నెలలకు పైగా అల్లాహ్ స్మరణం, దువా, ప్రత్యేక ప్రార్థనల చేసిన పుణ్య ఫలం లభించే రాత్రిని బడీరాత్ అంటారని మత పెద్దలు తెలిపారు. బడీరాత్ పురస్కరించుకుని ఆలూరులోని జామియా మసీదును విద్యుద్దీపాలతో అలంకరించారు.

మతోన్మాదులను ఓడించండి

కర్నూలు(సెంట్రల్): మత సామరస్యాన్ని కాపాడేందుకు మతోన్మాదులకు ఓటుతో బుద్ధి చెప్పాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ ముస్లింలకు పిలుపునిచ్చారు. శనివారం ఎంఎస్ ఫంక్షన్ హాలులో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం మత పెద్దలతో ఆయన మాట్లాడారు. ముస్లింలు, క్రిస్టియన్‌లు, కవులు, కళాకారులు, జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని, వాటిని అరికట్టడానికి కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీని ఓడించేందుకు ఓటును ఆయుధంగా వాడుకోవాలని కోరారు.

ఆదుకున్న సచివాలయాలు

- పకడ్బందీగా పింఛన్ల పంపిణీ పూర్తి చేసిన సచివాలయ ఉద్యోగులు
- సచివాలయ వ్యవస్థను మెచ్చుకుంటున్న లబ్ధిదారులు



వార్డు సచివాలయం

ఆదోని సెంట్రల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఎలాగైనా బురద జల్లాలనే ఆతృతతో చంద్రబాబు నాయుడు కుట్రలు చేసి వలంటీర్లను పింఛన్లు పంచకుండా చేశాడు. అయితే ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానస పుత్రిక అయిన సచివాలయ వ్యవస్థ ఆ కుట్రలను భగ్నం చేసింది. ఎక్కడెక్కడి నుంచో అవస్థలు పడుతూ వస్తున్న లబ్ధిదారులకు సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేశారు. దీంతో కుట్రలకు పాల్పడిన వారిని తిట్టుకుంటూ పింఛన్ లబ్ధిదారులు సచివాలయ వ్యవస్థను మెచ్చుకుంటూ సంతోషంగా వెళుతున్నారు.

చంద్రబాబు కుట్రతో పింఛన్ల పంపిణీకి బ్రేక్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన పాదయాత్రలో పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, వికలాంగులు అవస్థలను కళ్లారా చూశారు. వారి కష్టాలను తొలగించడానికి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ప్రతి నెలా వలంటీర్లు ఒకటో తేదీనే ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేసేవారు. అయితే సార్వత్రిక ఎన్నికల నెపథ్యంలో చంద్రబాబు వారి టీమ్ చేసిన కుట్రలతో ఏప్రిల్ నెలలో వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీ బ్రేక్ పడింది. దీంతో పింఛన్ల బాధ్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపకల్పన చేసిన వార్డు, గ్రామ సచివాలయాలు భుజానికెత్తుకున్నాయి. అందులో పనిచేసే ఉద్యోగులు కేవలం నాలుగు రోజుల్లో 96 శాతం పింఛన్లను పంపిణీ చేసి చూపించారు. అయితే చంద్రబాబు నాయుడు చేసిన కుట్రలతో పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, దివ్యాంగులు, మానసిక దివ్యాంగులతో పాటు ఎంతో మంది అవస్థలు పడ్డారు. గత ప్రభుత్వ హయాంలో పడిన కష్టాలను గుర్తు చేసుకున్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ

ఆదోని పట్టణంలోని 42 వార్డులలో 17,399 మంది, గ్రామీణ ప్రాంతంలో 11,898 పింఛన్ దారులు ఉన్నారు. నాలుగు రోజుల్లో 96 శాతం పింఛన్లను సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల దగ్గరకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు, మానసిక దివ్యాంగులకు ఇంటివద్దకే వెళ్లి పంపిణీ చేయాలని అధికారులు సూచించడంతో సిబ్బంది ఇంటి వద్దకు వెళ్లి నగదును అందజేశారు. అదే వలంటీర్ వ్యవస్థ ఉంటే పింఛన్ల పంపిణీ కార్యక్రమం రెండు రోజుల్లో పూర్తైయిది. వలంటీర్లు లేక పోయినా లబ్ధిదారులు ఎక్కువగా ఇబ్బంది పడకుండా సచివాలయాల సిబ్బంది పంపిణీని పూర్తి చేశారు. పింఛన్ దారుల కోసం సచివాలయాల వద్ద తాగునీటి వంటి సౌకర్యాలను కల్పించారు.

సారోళ్లు వచ్చి పింఛన్ ఇచ్చినారు



నాకు పక్షవాతం వచ్చి నడవలేని స్థితిలో ఉన్నాను. నాలాంటి వారు సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడాలి. తప్పని పరిస్థితిలో వెళ్లాలి అంటే ఒకరి సహాయంతో ఆటోలో వెళ్లాలి. రాను పోను ఆటో ఖర్చులుతో పాటు అవస్థలు పడాల్సి వచ్చేది. వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాళ్లు. చంద్రబాబు వలంటీర్లు పింఛన్ పంచకుండా చేశాడు. అయితే సచివాలయ ఉద్యోగులు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చి అవస్థలు తప్పించారు.

– ఈరన్న ఆదోని

వలంటీర్ వ్యవస్థ బాగుంది



జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ బాగుంది. ప్రతి నెలా తెల్లవారక ముందే ఇంటికి వచ్చి పింఛన్లు ఇచ్చేవాళ్లు. వలంటీర్లను తీసి వేయడంతో పింఛన్ల కోసం అవస్థలు పడ్డాం. సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. అక్కడ సార్‌వాళ్లు అన్ని సౌకర్యాలు కల్పించారు.

– వెంకటలక్ష్మి, ఆదోని

నేటి నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

ఆస్పరి: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ నిర్వాహకులు రాంప్రసాద్, గ్రామ పెద్దలు శనివారం తెలిపారు. 7 ధ్వజారోహణము సందర్భంగా స్వామీ, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, 8న పూజా కార్యక్రమం, 9న ఉగాది, 10న పెద్ద నుగ్గలాట, 11న స్వామి వారికి ప్రత్యేక పూజలు, 12న సాధారణ పూజలు, 13న రథోత్సవం,14న ప్రత్యేక పూజలు, 15న వసంతోత్సవం ఉంటుందన్నారు.

13న సీతారాముల కల్యాణం

కర్నూలు కల్చరల్: ఈనెల 13వ తేదీన సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్నుట్లు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి సభ్యులు తెలిపారు. ఈనెల 11 వతేదీ సాయంత్రం 6 గంటలకు స్థానిక గోశాలలో తలంబ్రాల సేవ, 12వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామి వార్లకు తిరుమంజన సేవ, 13వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి కర్నూలు మున్సిపల్ ఎగ్జిబిషన్ హైస్కూల్ గ్రౌండ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, 6 గంటల నుంచి ధార్మిక ప్రవచనం, 7 గంలలకు సీతారాముల కల్యాణ వేడుక జరుగుతుందని పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, శ్రీశైల దేవస్థానం వ్యాఖ్యాత ప్రవచనకారులు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు ఉపన్యసిస్తారని తెలిపారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



ఇంద్రనగర్ కాలనీలో ర్యాలీ నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ, అధికారులు

ఆదోని రూరల్: అర్హులై ఇంకా ఓటరుగా నమోదు చేసుకోనివారు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివ నారాయణశర్మ అన్నారు. శనివారం పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో రామాలయం సమీపంలో ఓటుహక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు నిండినా ఎన్‌రోల్ చేసుకోకపోతే ఏప్రిల్ 16వ తేదీ వరకు ఎన్‌రోల్ చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. ఓటర్ నమోదు శాతాన్ని పెంచుకోవాల్సిన అవసరరందని సబ్‌కలెక్టర్ అన్నారు. అదేవిధంగా ప్రజలందరూ పెద్దస్థాయిలో బయటికి వచ్చి రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కు బాధ్యతని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని ఇంద్రనగర్ కాలనీ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా తిరిగి ఇంద్రనగర్‌కాలనీ వరకు చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఏ-2 పరీక్షలు ప్రారంభం



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌ఏ-2 (వార్షిక) పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఒకటవ తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. 1 నుంచి 5వ తరగతి, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటలకు వరకు పరీక్షలు నిర్వహించగా 9వ తరగతి విద్యార్థులకు మాత్రం ఉదయం 9 నుంచి 12.15 వరకు పరీక్షలను నిర్వహించారు. ప్రశ్న పత్రాలను పరీక్ష ప్రారంభానికి గంట ముందు మండల విద్యా వనరుల కేంద్రం నుంచి ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకుని వెళ్తున్నారు. ఈ నెల 16వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులను ఆన్‌లైన్‌లో ఎక్కించాల్సి ఉంటుంది. 23వ తేదీన విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులను పంపిణీ చేయనున్నారు. 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు పాఠశాలలకు వేసవి సెలవులను ప్రకటించారు.

అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి



కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దళిత, ఎమ్మార్పీఎస్ సంఘం నాయకులు

ఆదోని రూరల్: ఈనెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలని దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.దేవప్రసాద్, జిల్లా అధ్యక్షుడు జైభీమ్ సాయిరామ్, పట్టణ అధ్యక్షులు గుమ్మల బాలుస్వామి కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పెయింటింగ్, లైట్స్, మైక్, ఇతర సామగ్రిని ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బండారి గిడ్డయ్య, ఆదోని ఇన్‌చార్జ్ జగన్నాథ, మాలమహానాడు పట్టణాధ్యక్షులు ఎం.బొబ్బిలి, జిల్లా నాయకులు వీరేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై ఆర్వో సమీక్ష



కోసిగిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్వో పి.మురళి

మంత్రాలయం : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరల్, పోలీస్ అధికారులకు ఆర్వో ఎ.మురళీ ఎన్నికలపై శనివారం సమీక్ష నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాలకు రాలేని వారు, 85 ఏళ్ల పైబడిన వారి జాబితా తయారు చేసి హోమ్ ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. విధి విధాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. నోడల్ అధికారులు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీవివిటీ టీమ్ అధికారులు ఎలాంటి కోడ్ ఉల్లంఘనలు జరుగకుండా చూడాలని సూచించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, సివిల్ ఫిర్యాదులు వచ్చిన 80 నిమిషాల్లోగా విచారణ జరిపి పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఎన్నికల యాప్ నిర్వహణపై తగిన అవగాహన కలిగిఉండాలన్నారు. పరిమితికి మించిన నగదు, అభ్యంతర వస్తువులు పట్టుబడినప్పుడు సీజ్ చేయాల్సి వస్తే తీసుకోవాల్సి చర్యలపై సీజర్ మేనేజ్‌మెంట్ శిక్షణ ఇచ్చారు. అనంతరం మంత్రాలయం, కోసిగిలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కోసిగి, మంత్రాలయం తహసీల్దార్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అరుదైన శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేక శిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగం వైద్యులకు అరుదైన శస్త్రచికిత్సలు చేసేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. శనివారం ఆ విభాగ వైద్యులతో ఆరోగ్యశ్రీతో పాటు పలు విషయాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గైనిక్ విభాగంలో ఆరోగ్య శ్రీ కేసుల నెలవారీ లక్ష్యాలను పెంచుతున్నట్లు తెలిపారు. ఇక్కడి కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడే వైద్యపరీక్షలు, చికిత్స అందించే విధంగా చర్యలు తీసుకోవాలని హెచ్ఓడీని ఆదేశించారు. హాజరుపట్టిలో వైద్యులు సంతకాలు తప్పనిసరిగా చేయాలని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, గైనిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

హౌస్ సర్జన్లు గుర్తింపు కార్డు ధరించాలి

ఆసుపత్రిలో విధుల్లో ఉన్నప్పుడు హౌస్‌సర్జన్లు తప్పనిసరిగా గుర్తింపుకార్డు, డ్రెస్ కోడ్ ధరించాలని, బయోమెట్రిక్ హాజరు, రిజిస్టర్‌లో సంతకం తప్పనిసరిగా చేయాలని సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి ఆదేశించారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో హౌస్‌సర్జన్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌస్‌సర్జన్లకు విధి విధానాల గురించి జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ వి. బ్రహ్మారెడ్డి వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలోని గౌరీ గణేష్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌పై తక్షణమే విచారణ జరిపి స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డీఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, డివిజన్ అధ్యక్షుడు వంశీ కోరారు. శనివారం డిప్యూటీ ఈఓ కార్యాలయంలో ఇన్‌చార్జ్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గౌరీ గణేష్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి వేలకు వేలు ఫీజులు తీసుకుంటూ కనీసం విద్యార్థులకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

ఆదోని అర్బన్: బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నాయకులు జెండా ఆవిష్కరించారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీని అభివృద్ధి పరచాలని, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మలేకర్ శ్రీనివాస్, నాగరాజుగౌడ్, రంగస్వామి, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహం

కర్నూలు కల్చరల్: శ్రీక్రోధి నామ సంవత్సరం చైత్ర శుద్ధి పాడ్యమిని పురస్కరించుకొని ఈనెల 9వ తేదీన ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, శ్రీరామ సేవా మండలి, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం స్థానిక రాంబొట్ల ఆలయంలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9వ తేదీ సాయంత్రం 5 గంటలకు ఉగాది పంచాంగ శ్రవణం, 10 నుంచి 16వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం 6 గంటల నుంచి పండితులతో శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహ కార్యక్రమం, 17వ తేదీ సీతారాముల కల్యాణ మహోత్సవం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం రామకృష్ణ, ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రఘునందన్ సేవక్ ప్రభు, ధర్మ ప్రచార మండలి సభ్యులు డాక్టర్ శ్రీమహాలక్ష్మి, బి.శ్రీరాములు, ఆరవీటి రమేష్, కృష్ణ కాంత్, శ్రీనివాసులు, జెట్ట యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్

కర్నూలు (హాస్పిటల్) : పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్ ఎంతగానో ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ కేబినెట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ చెప్పారు. జాతీయ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీ సైక్లింగ్-పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీ సైక్లింగ్-పునర్వినియోగంపై అవగాహన కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కర్నూలు అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ డ్యామ్‌లో తగ్గుతున్న నీటి నిల్వలు

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం(టీబీ డ్యాం)లో రోజు రోజుకు నీటి మట్టం తగ్గుముఖం పడుతున్నాయి. 105.788 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి గానూ శనివారం నాటికి 4.292 టీఎంసీలకు చేరింది. గతేడాది ఇదే సమయానికి 5 టీఎంసీలు ఉండేవి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో ఒక పంటకు మాత్రమే సాగునీరు ఇచ్చిన టీబీ బోర్డు అధికారులు.. ఎల్లెల్సీకి గతేడాది డిసెంబర్‌లో నీటి సరఫరాను నిలిపేశారు. తిరిగి తాగునీటి అవసరాలకు గానూ ఫిబ్రవరి 19న విడుదల వేశారు. 50 రోజుల పాటు కొనసాగించి ఈనెల 11న నీటి సరఫరాను నిలిపేయనున్నారు.



సంక్షేమమే గెలుపునకు నాంది



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ప్రియాంక రెడ్డి



ప్రచార పత్రం అందజేస్తున్న జయమ్మ

కౌతాళం: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందజేసిన సంక్షేమ పథకాలే మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాంది పలుకుతాయని కాచపురం సర్పంచ్, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సతీమణి వై.జయమ్మ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కుమార్తె ప్రియాంకరెడ్డి, ప్రదీప్‌రెడ్డి భార్య అనూషమ్మ, పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదాచారితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. మేళిగనూరుతో పాటు నదిచాగి గ్రామంలో ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి బాలనాగిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఇన్నేళ్ల చరిత్రలో ఏ ప్రభుత్వం అందజేయని సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందజేసి జగనన్న నూతన చరిత్ర లిఖించారని, మళ్లీ అదే పాలన, సంతోషం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని అభ్యర్థించారు. పథకాలతో వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతో టీడీపీ నాయకులు వలంటీర్లను దూరం చేయించి పేదలకు పథకాలు అందకుండా కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామ ఇన్‌చార్జి రామన్నగౌడ్, ఎంపీటీసీ లింగన్నగౌడ్, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్‌సాబ్, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, నాయకులు వడ్డెరాము, భీమేష్, అబ్దుల్ సమద్, మాజీ సర్పంచ్ అవతారం, ఇద్రూస్, అనిల్‌కుమార్, మరేగౌడ్, వీరేష్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



కోసిగిలో ఓటు అభ్యర్థిస్తున్న మురళీమోహన్ రెడ్డి

కోసిగి: మండల కేంద్రంపై ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించి ఎంతో అభివృద్ధి చేశారని.. ఆ అభివృద్ధిని చూసి మళ్లీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి కోరారు. శనివారం స్థానిక గాంధీనగర్, మైనార్టీ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, శ్రీరామనగర్, రామక్కమ్మ కాలనీల్లో మండల నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి వీధిలో డ్రైనేజీ, సీసీ రోడ్డులు వేయించామన్నారు. పులికనుమ ప్రాజెక్ట్ నుంచి కోసిగి కి తాగు, సాగునీటిని అందించేందుకు రూ.6కోట్లతో పైప్‌లైన్ పనులు పూర్తి చేయించామన్నారు. భూగేని చెరువు స్టోరేజీ ట్యాంక్ నిర్మాణం కోసం ముమ్మరంగా పనులు చేయించినట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేశారన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.పార్టీ మండల అధ్యక్షుడు బెట్టనగౌడ, శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, మంగమ్మ, మాంతేష్ స్వామి, మాణిక్యరాజు, బుల్లి నరసింహులు, కోసిగయ్య, బండ్ల గోవిందు, యల్లయ్య, బసవరాజు, ప్రతాప్, వీరేష్, గోపాల్, ఆనంద్ పాల్గొన్నారు.

13న లేజర్ రన్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 13 న స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మోడరన్ పెంటాథ్లాన్‌లో లేజర్ రన్ (రన్ షూట్ రన్) సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ మాస్టర్స్ బాల బాలికలు, స్త్రీ,పురుషుల విభాగాల్లో జిల్లా స్థాయి టోర్నమెంట్ -కమ్- ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు మోడరన్ పెంటాథ్లాన్ జిల్లా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికయిన క్రీడాకారులు ఈనెల 20 నుంచి నెల్లూరు జిల్లా కావలిలో జరిగే 8 వ రాష్ట్ర స్థాయి లేజర్ రన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 93984- 22533 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రైతుపై మహిళా కూలీల దాడి



రైతుతో మాట్లాడుతున్న మహిళా కూలీలు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో డబ్బు ఇవ్వనందుకు వేరుశనగకాయల రైతుపై ఐదుగురు మహిళా కూలీలు ఇనుప చాటతో దాడి చేసిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. రైతు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామానికి చెందిన మాల నాగార్జున శనివారం 20 సంచుల వేరుశనగకాయలను ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు అమ్మకానికి తీసుకొచ్చాడు. యార్డులోని ఓ ఏజెంట్ వద్ద 20 సంచులు అమ్మకానికి టెండర్ పెట్టారు. మధ్యాహ్నం టెండర్ ప్రకటన తర్వాత రైతు వేరుశనగకాయల దిగుబడి క్వింటా రూ.5990 చొప్పున ఓ వ్యాపారికి నమోదయ్యింది. దీంతో ఆ రైతు వేరుశనగకాయలను మహిళా కూలీలతో శుభ్ర చేయించేందుకు వచ్చాడు. మహిళా కూలీలు వేరుశనగకాయలను మధ్యలోనే శుభ్రపరచడం ఆపుతామని, తమకు రూ.500 ఇవ్వాలని రైతును డిమాండ్ చేశారు. అయితే డబ్బు ఎందుకు ఇవ్వాలి, శుభ్రం చేయండి, ఇప్పటికే ఆలస్యమయ్యిందని రైతు చెప్పినందుకు ఆగ్రహించిన మహిళా కూలీలు ఇనుప చాటతో దాడి చేశారు. దీంతో వెంటనే యార్డు కార్యాలయంలో అధికారులకు రైతు ఫిర్యాదు చేశాడు. విషయంపై అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ దృష్టికి తీసుకెళ్లగా రైతుపై మహిళలు దాడి చేసిన విషయం తెలిసిందని, అయితే తమకు ఫిర్యాదు చేయలేదని, రైతు, మహిళలు, వ్యాపారులు, ఏజెంట్ మాట్లాడుకొని రాజీ అయ్యారని తెలిపారు.